క్లుప్తంగా

సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలి

డాక్టర్ ఎం.రత్నకుమారి



నగరం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, సాధారణ ప్రసవాలపై అవగాహన పెంచుకోవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రత్నకుమారి చెప్పారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సాధారణ ప్రసవాలపై గర్భిణులు, ఆశా వర్కర్‌లకు అవగాహన కల్పించారు. గర్భిణులు పోషక విలువల కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలను ఆశా వర్కర్‌లు గర్భిణులకు తెలియజేయాలన్నారు. సిజేరియన్‌ల వల్ల జరిగే పరిణామాలను కూడా వివరించాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు.

మార్కెట్‌యార్డులకు చైర్మన్‌ల నియామకం

రేపల్లె రూరల్: నియోజకవర్గంలోని రెండు మార్కెట్‌యార్డులకు చైర్మన్‌లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రేపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్‌గా జనసేనకు చెందిన మత్తి అనురాధకు, కూచినపూడి మార్కెట్‌యార్డు చైర్మన్‌గా టీడీపీకి చెందిన ఒగిబోయిన వెంకటేశ్వరరావు యాదవ్‌లను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎదురెదురుగా వస్తున్న లారీలు ఢీ



కొల్లూరు : అతివేగంగా వస్తున్న రెండు లారీలు ఎదురెదురుగా ఢీ కొట్టుకున్న ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొల్లూరు వ్యక్తికి చెందిన లారీ తెనాలి వైపు నుంచి కొల్లూరు వైపు వస్తుంది. అదే సమయంలో ఎదురుగా బోయపాలెం వ్యక్తికి చెందిన లారీ ఇసుక లోడ్‌తో తెనాలి వైపు వెళుతుంది. దీంతో రెండు లారీలు ఒకదానికొకటి ఢీ కొట్టుకున్నాయి. ప్రమాదం సమయంలో లారీలు రెండూ అతి వేగంతో ప్రయాణిస్తున్న కారణంగా లారీల ముందు భాగం ధ్వంసమయ్యింది. అయితే ప్రమాదంలో ఒక లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో వెంటనే స్థానికులు 108 వాహనంలో తెనాలి వైద్యశాలకు తరలించారు. లారీలు ఢీ కొనడంతో కొద్ది సమయం వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లింది.

రైలులో ప్రయాణిస్తూ... యువకుడు మృతి



తెనాలిరూరల్: రైలులో ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 23 నుండి 25 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని యువకుడు రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్‌లో కోయంబత్తూర్ నుంచి ఉత్తర్ ప్రదేశ్‌కు వెళుతున్నాడు. రైలు శుక్రవారం బాపట్ల దాటగానే యువకుడు ఉలుకు లేకుండా పడి ఉండడంతో గమనించిన తోటి ప్రయాణికులు టీసీకి సమాచారమివ్వడంతో ఆయన అధికారులకు సమాచారమిచ్చి తెనాలిలో రైలును ఆపి యువకుడిని కిందు దింపారు. రైల్వే వైద్యురాలు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు ధృవీకరించారు. మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎక్స్‌పోలు దోహదం



తెనాలిఅర్బన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎక్స్‌పోలు దోహదపడతాయని సెయింట్‌పాల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరెక్టర్లు చావాలి అకుల్‌నాథ్, చావాలి తేజోనాథ్‌లు పేర్కొన్నారు. మారీసుపేట రెండుగేట్ల మధ్యలోని సెయింట్ పాల్స్ ఇంగ్లీషు మీడియంస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాల ద్వారా వివిధ రకాల నమోనాలను విద్యార్థులు తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తోడేటి సలోమి దివ్యతేజ, స్కూల్ వ్యవస్థాపకులు ఎండీ చావాలి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం.. చర్యలు శూన్యం

- దేవస్థానం భుములను కొల్లగొడుతున్న టీడీపీ నేతలు
- శిరిపూడిలో దేవస్థానం భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు
- ధర్మసత్రం భూములను అన్యాక్రాంతం చేస్తున్న టీడీపీ నాయకుడు
- అధికారుల తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- అక్రమార్కులకు టీడీపీ ముఖ్య నేత అండ



శిరిపూడిలోని దేవస్థాన భూముల్లో మట్టిని తవ్విన దృశ్యం



ధూళిపూడిలో ధర్మసత్రం భూముల్లో తోలిన మట్టి

నగరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నేతల ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోతుంది. అక్రమార్జనే లక్ష్యంగా టీడీపీ నాయకులు బరితెగిస్తున్నారు. అధికారం... మాది... మా ఇష్టమొచ్చినట్లు చేస్తాం ... మా జోలికి వస్తే సహించేది లేదని టీడీపీ నేతలు అధికారులకు హుకుం జారీ చేశారని వాదనలు బలంగా విన్పిస్తున్నాయి. అందుకే అధికారులు తవ్వకాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని శిరిపూడి గ్రామంలో దేవస్థానం భూములను కొల్లగొడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టి జేబులు నింపుకుంటున్నారు. చెరుకుపల్లిలోని చెన్నకేశవస్వామి దేవస్థానంకు చెందిన భూములు శిరిపూడి గ్రామంలో ఉన్నాయి. ఈ భూముల్లోని మట్టిని అక్రమంగా టీడీపీ నేతలు యథేచ్ఛగా దూరప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టపగలే జేసీబీలతో తవ్వి ట్రాక్టర్లతో తరలించి అమ్ముకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

ధర్మసత్రం భూములు అన్యాక్రాంతం

దేవస్థానం భూములతో పాటు ధర్మసత్రం భూములనూ టీడీపీ నేతలు వదలటం లేదు. పొన్నూరుకు చెందిన ఆలపాటి సుబ్బారాయుడు ధర్మసత్రంకు చెందిన 7.91 ఎకరాల భూములు మండలంలోని ధూళిపూడి గ్రామంలో ఉన్నాయి. ఈ భూములను టీడీపీ నేతలు అన్యాక్రాంతం చేస్తున్నారు. సత్రంకు చెందిన భూములను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆక్రమించుకుని మెరక చేస్తున్నారు. గత రెండు రోజల నుంచి ధర్మసత్రం భూములను టీడీపీ నేత అక్రమంగా పూడ్చుతున్నారు. ధర్మసత్రం భూములు దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలో ఉన్నాయి. భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమార్కులకు అండగా టీడీపీ ముఖ్యనేత

దేవస్థానం భూములను కొల్లగొడుతున్నా, ధర్మసత్రం భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడం చర్చినీయాంశంగా మారింది. స్థానిక రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అండదండలతోనే శిరిపూడిలోని దేవస్థాన భూముల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. అందుకే అధికారులు వారిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దేవస్థానం భూముల్లో మట్టిని తరలించిన వారిపై, ధర్మసత్రం భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పొన్నూరులోని ఆలపాటి సుబ్బారాయుడు ధర్మసత్రం భూములు ధూళిపూడి గ్రామంలో ఉన్నాయి. ధర్మసత్రం భూములను పూడ్చుతున్నట్లు ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. రెండు రోజులు క్రితమే ఈవోగా బాధ్యతలు చేపట్టాను. ధర్మసత్రం భూములను సర్వే చేసి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– నాగమల్లేశ్వరి, ఈవో

వాడి వేడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

- అధికారులపై మండిపడ్డ ప్రజా ప్రతినిధులు
- మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారా లేరా అని ప్రశ్నించిన ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సాధారణ సమావేశం వాడి వేడిగా శుక్రవారం కొనసాగింది. కొందరు ప్రజా ప్రతినిధులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పని తీరు అంతంత మాత్రంగా ఉందని కొన్ని కేంద్రాల్లో పిల్లలు లేకపోయినా కార్యకర్తలు వారి ష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పిల్లల లేని కేంద్రాల వల్ల ఎవరికి ఉపయోగమో తెలియజేయాలని సంగుపాలెం ఎంపీటీసీ సభ్యులు చెన్నుబోయిన గంగయ్య ఐసీడీఎస్ అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పేలు చూసుకోవడం ఫోన్లు మాట్లాడుకుని వెళ్లిపోవడం తప్ప వారు చేసే పని ఏముందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- అదేవిధంగా చందోలు గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్ద హరిజనవాడలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారా..? లేరా .. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని చందోలు 3 ఎంపీటీసీ సభ్యులు విజయరాజు అడిగారు.
- అల్లూరు గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అల్లూరు ఎంపీటీసీ సభ్యురాలు వాలి కృష్ణకుమారి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.
- పిట్టలవానిపాలెం మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారా లేరా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఎంపీపీ దెందుకూరు సీతారామరాజు వ్యవసాయ శాఖ అధికారి సత్యానంద్‌పై మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు విషయంలో వ్యవసాయ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నారని, ఏడాది వ్యవసాయం చేసిన రైతులు ధాన్యం అమ్ముకునే విషయంలో ఎవరిని సంప్రదించాలో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. రైతుల గురించి పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు.
- భవనం వారి పాలెం ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధు మాట్లాడుతూ గ్రామంలో సిమెంట్ రోడ్డును జనవరి 14వ తేదీన ప్రారంభించారని, నిర్మాణం చేపట్టిన నాలుగు నెలల్లోనే రోడ్డు పగిలిపోయిందని సమావేశం దృష్టికి తెచ్చారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.
- అయితే ఈ సమావేశానికి పంచాయతీరాజ్ ఏఈ హాజరు కాకపోవడంతో భవనం వారి పాలెం గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొని రోడ్డు నాణ్యత విషయంలో ఎలాంటి లోపాలు లేవని నల్ల మట్టి కావడం వలన రోడ్డు పగిలినట్లుగా కనిపిస్తుందని ఇంకా నిర్మాణ పనులు పూర్తి కాలేదని త్వరలో పనులు చేయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణ పనులు పూర్తి కాకపోతే రోడ్డు ప్రారంభోత్సవం ఏ విధంగా చేశారని ధ్వజమెత్తారు. రోడ్డు పగిలిపోవడానికి కారణాలు తక్షణమే నాకు తెలియజేయాలని ఎంపీటీసీ సభ్యురాలు సింధు పట్టుపట్టారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రిజిస్టర్ భూములను అసైన్డ్ జాబితా నుంచి తొలగించాలి

ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుజన్ మాదిగ



జేసీకి వినతి పత్రం అందిస్తున్న ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుజన్‌మాదిగ

బాపట్ల: చీరాల మండలం కీర్తివారిపాలెంలోని ఎం.శ్రీనివాసరావుకు చెందిన రిజిస్ట్రేషన్ భూములను అసైన్డ్ జాబితా నుంచి తొలగించాలని ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుజన్‌మాదిగ కోరారు. బాపట్ల కలెక్టరేట్‌లోని జేసీని శుక్రవారం కలిసి వినతి పత్రం అందించారు. సర్వే నంబరు 870లో ఒక ఎకరా 40 సెంట్లు 1934లో ప్రభుత్వం నుంచి వేలం ద్వారా సంక్రమించిన రిజిస్టర్ భూమిని ఎం.శ్రీనివాసరావు అనే రైతు కొనుగోలు చేశారని వివరించారు. భూమి గత 80 సంవత్సరాలకు పైగా మూడు రిజిస్ట్రేషన్లు జరిగి రైతు ఆధీనంలో ఉన్న, రిజిస్టర్ భూమిని అసైన్డ్ జాబితాలోకి చేర్చటం అధికారులు తప్పిదమని, దానికి రైతులను బలి చేయొద్దని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చీరాల తహసీల్దార్ రెవెన్యూ సమస్యలను పరిష్కరించకుండా, రైతులను కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని వివరించారు. అసైన్డ్ జాబితాలో చేర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎంఎస్‌పీఎస్ నాయకులు గద్దె త్యాగరాజు, కొలకలూరి విజయ్ కుమార్, వంశీ ఉన్నారు.

ఇదేనా మీరు యాదవ సామాజికవర్గంపై చూపించే ప్రేమ

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు

బాపట్ల : కోర్టు పరిధిలో ఉన్న అంశంపై ఒక యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలో సైకిల్ స్టాండ్ నడుపుకొని బతుకుతా ఉంటే అధికారపక్షం అండతో బీసీలపై అత్యంత కర్కశంగా వ్యవహరించిన తీరు ఎంతో దారుణమని కర్లపాలెం మండల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు ధ్వజమెత్తారు. శుక్రవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సైకిల్ స్టాండ్ కాంట్రాక్టర్ వెంకటరావుకు చెందిన షెడ్డును జేసీబీలతో దారుణంగా తొలగించి అతని జీవనోపాధిపై దెబ్బ కొట్టిన అధికార పార్టీపై ఏడుకొండలు మండిపడ్డారు. ఇదేనా మీరు బీసీల పట్ల చూపించే ప్రేమ అని బీసీలకు ఎప్పుడూ టీడీపీ ద్రోహం చేస్తూనే ఉన్నది అనేదానికి ఇది ఉదాహరణ అని అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వెంకట్రావు సైకిల్ స్టాండ్ నిర్వహిస్తూ దాని గడువును పొడిగించాలని కోర్టును ఆశ్రయించినా కూడా ఆ అంశంపై ఇంకా కోర్టు ఎటువంటి తీర్పు వెలువరించక ముందే దౌర్జన్యంగా జేసీబీలు తీసుకొని వెళ్లి తన జీవనోపాధిపై దెబ్బతీశారని దీనిని బీసీ సామాజిక వర్గం ఎట్టి పరిస్థితుల్లో సహించదన్నారు. కోర్టు తీర్పు వచ్చేవరకు తన జోలికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని లేదంటే బీసీ సామాజిక వర్గం ఉద్యమిస్తుందని అన్నారు. వెంటనే ఇటువంటి కక్షపూరిత చర్యలు ఆపకపోతే బీసీ సామాజిక వర్గం తగిన విధంగా బుద్ధి చెబుతుందని హెచ్చరించారు.

జోరుగా సీనియర్స్ విభాగ ఎడ్ల బల ప్రదర్శన



జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి పొందిన ఎడ్ల జత

తెనాలిరూరల్: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన, పశు పాల ప్రదర్శన పోటీలు చివరి రోజు జోరుగా సాగాయి. గత నెల 29 నుంచి జరుగుతున్న పోటీల్లో చివరి రోజైన శుక్రవారం సీనియర్స్ విభాగం పోటీలు నిర్వహించగా, 11 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. ఈ విభాగ పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. గురువారం రాత్రి పొద్దు పోయే వరకు జరిగిన జూనియర్స్ విభాగ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణ చౌదరిల ఎడ్ల జత నిర్ణీత సమయంలో 3582 అడుగులు లాగి ప్రథమ బహుమతిని పొందాయి. హైదరాబాద్‌కు చెందిన డి. రోహన్ బాబు ఎడ్ల జత (3307.07 అడుగులు) రెండో బహుమతిని, గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్ల జత(3033.01 అడుగులు) మూడో బహుమతిని సాధించాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పారిశ్రామికవేత్త ముళ్లపూడి నరేంద్రనాథ్, 1875లో బ్రెజిల్ దేశానికి ఒంగోలు జాతి గిత్తలను తీసుకెళ్లిన కుటుంబ వారసుడు మార్సెలో అతిథులుగా హాజరయ్యారు. జూనియర్స్ విభాగంలో విజేతలకు బహుమతులను అందజేశారు.ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పోటీల కన్వీనర్ నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు. సూరపనేని రాధాకృష్ణమూర్తి రిఫరీగా వ్యవహరించారు. సీనియర్స్ విభాగం పోటీలు శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు జరిగాయి.

సందేశాత్మక చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలి

దర్శకుడు రత్నాకర్ కనపర్తి



కరపత్రాన్ని ఆవిష్కరించిన రత్నాకర్

తెనాలి: సందేశాత్మక చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని సినీ దర్శకుడు కనపర్తి రత్నాకర్ సూచించారు. ప్రముఖ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే సినిమా ఈనెల 10న తెనాలిలో విడుదల సందర్భంగా శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. చిత్ర విశేషాలను విలేకరులకు చిత్రంలో నటించిన కళాకారులు వివరించారు. తెనాలికి చెందిన ఔత్సాహిక నటీనటులు, కళాకారులు ఈ సినిమాలో 20 మందికి పైగా నటించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్ మాట్లాడుతూ, మహోన్నతుల చరిత్రను భావితరాలకు చాటి చెప్పేందుకు సినిమా మాధ్యమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళా విద్య కోసం, వితంతు పునర్వివాహాలకోసం, సమసమాజ స్థాపన కోసం జ్యోతిరావుపూలే పాటుపడ్డారని గుర్తుచేశారు. ఇలాంటి మహనీయుల చరిత్రను వెండి తెర చిత్రంగా మలచిన దర్శక, నిర్మాతలకు, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఫిల్మ్ ఫెస్టివల్స్ లో జ్యోతి రావు పూలే సినిమా ప్రదర్శనకోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. పెద్దీటి యోహాను, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.

హిందూ ధర్మ వ్యాప్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఎస్ఎస్‌పీ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు



నిజాంపట్నం: శ్రీరాముని స్ఫూర్తిగా హిందూ ధర్మ వ్యాప్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలో శుక్రవారం జరిగిన సమరసత సేవా ఫౌండేషన్ మండల స్థాయి సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరామ నవమి ఉత్సవాలను గ్రామగ్రామాన ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ నెల 24న ప్రతి గ్రామంలోని దేవాలయాల్లో ఏకాదశి నగర సంకీర్తన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 12న మహా పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక హారతుల కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. సమావేశంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ కాశీపల్లి గౌరీశంకర్, సభ్యులు కొప్పనాతి శ్రీనివాసరావు, బొమ్మిడి వెంకటేశ్వరరావు, రేవు రాముడు, పీతా వెంకటేశ్వరరావు, సుధాకర రావు, సోమయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రహదారిపై నీటితో ఇబ్బందులు



వేమూరు : రహదారిపై నిలుస్తున్న నీరు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని జంపనిలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన కొద్దిపాటి వర్షానికి నీరు అంతర్గత రహదారుల్లో నిలిచిపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. రహదారులపై నీరు నిలిచిపోయి సమస్యాత్మకంగా మారినప్పటికీ పంచాయతీ యంత్రాంగం డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరిచే విషయంలో నిర్లక్ష్యంగా ఉండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణం అధికారులు స్పందించి రహదారులపై నీరు నిలవకుండా డ్రైనేజ్ వ్యవస్థను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునః పరిశీలన జరిపేందుకు తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఆర్థో, ఈఎన్‌టీ తదితర విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలలో పరీక్షలు చేయించుకున్నారు. సూపరింటిండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పర్యవేక్షించారు.

ఆలయాలకు పసుపు, కుంకుమ, అక్షింతలు అందజేత



పసుపు, కుంకుమ, అక్షింతలను అందజేస్తున్న గుంటూరు జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ అమ్ముడు

రేపల్లె రూరల్: టీటీడీ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించనున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ అమ్ముడు తెలిపారు. నియోజకవర్గంలోని నిజాంపట్నం, కొత్తపాలెంలోని కోదండరామస్వామి ఆలయాలు, పొన్నపల్లిలోని సీతారామ ఆలయం, సజ్జావారిపాలెంలోని రామాలయాలను సందర్శించి ఆలయాల నిర్వాహకులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నుంచి వచ్చిన పసుపు, కుంకుమ, అక్షింతలను అందజేసి మాట్లాడారు. టీటీడీ ఆర్థిక నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ దళిత వాడల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా రామాలయాలతో పాటు ఎస్సీ, ఎస్టీ వాడల్లో నిర్మించుకున్న ఆలయాలకు పసుపు, కుంకుమ, అక్షింతలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతికి ఆయువుపట్టు బాపట్ల

రిటైర్డు జనరల్ డి.చక్రపాణి



మాట్లాడుతున్న రిటైర్డు డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి

బాపట్ల: తెలుగు జాతికి ఆయువుపట్టు లాంటిది బాపట్ల జిల్లా అని రిటైర్డు డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటు రోజు సందర్భంగా స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డి.చక్రపాణి మాట్లాడుతూ తెలుగుజాతికి బాపట్ల ఎంతో ప్రత్యేకత అని గుర్తుచేశారు. తెలుగు రాష్ట్ర అవతరణకు ఇక్కడే పునాదులు పడ్డాయని చెప్పారు. తెలుగు సాహిత్యం ఇక్కడే ఓనమాలు దిద్దుకుందని, తెలుగు పద్యం బాపట్ల జిల్లాలోనే పుట్టిందని, తెలుగు లిపి కూడా జిల్లాలోనే పురుడు పోసుకుందని గుర్తు చేసుకున్నారు. ఆంధ్రుల చరిత్ర కూడా బాపట్ల జిల్లాలోనే ప్రారంభమైందని చెప్పారు. ఆంధ్ర మహాభారతాన్ని బాపట్లకు చెందిన ఎర్రాప్రగడ గట్టెక్కించారని అద్దంకికి చెందిన పద్య కవి డీఎం సత్యనారాయణ చెప్పారు. బౌద్ధానికి పెద్దపీట వేసి, ఆచార్య నాగార్జునుడి జన్మస్థలంగా భాసిల్లుతున్నదని వివరించారు. సభకు ఆర్ట్స్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ డబ్ల్యుఏజీకే మూర్తి అధ్యక్షత వహించారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, సుశీల కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ ప్యార్లీ సునీల్ కుమార్, సెర్ప్ కార్యదర్శి సీహెచ్ పార్థసారథి, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, ఉపాధ్యాయ నాయకులు గురజాల శ్రీనివాసరావు, తెలుగు పండితులు పరిమి సుబ్రహ్మణ్య శాస్త్రి, రిటైర్డు రైల్వే ఉద్యోగి మానం అప్పారావు, నాయకులు ఉమారెడ్డి రామారావు, సీనియర్ సిటిజన్ నాయకులు జీవీ బ్రహ్మం, శ్రీహరిరావు, బందా బాబు, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి యాజలి భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ జిట్టా కన్యాకుమారి, యోగా గురువు ధూళిపాళ్ల శైలజ, చిత్రకారుడు జీవీ, రావూరి నరసింహ వర్మ, మాజీ సైనికుల సంఘం నాయకులు కష్టారావు, విశ్రాంత తహసీల్దార్లు సత్యనారాయణ, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయ భవనాలు నిర్మింపజేసిన చక్రపాణిని పట్టణంలోని పలు సంఘాల వారు ఘనంగా సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



కాల్వ పూడికతీత పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ అరుణ

తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్యలను పరిష్కారించడానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. చెంచుపేటలో శుక్రవారం జరుగుతున్న మురుగుకాల్వల పూడికతీత పనులను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రధాన మురుగు, పంట కాల్వల పూడికతీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. వేసవి కాలం ముగిసేలోపు కాల్వల్లో పారుదల జరిగే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ, ఆరోగ్యశాఖాకారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

తెనాలిటౌన్: ఇంటితో పాటు గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొలకలూరు గ్రామస్తులకు ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి సువర్ణలత పిలుపునిచ్చారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఉషారాణి, శాస్త్రవేత డాక్టర్ టి.వెంకటరాములు, ప్రొఫెసర్ టి.సంధ్యారాణి, ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఏజె సువర్ణలత పాల్గొని గ్రామస్తులకు ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి విషయాలపై అవగాహన కల్పించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు ఆధునీక వ్యవసాయంపై అవగాహన కల్పించడమేగాక గ్రామస్తులకు విద్యా, వైద్యం, ఆరోగ్యం వంటి విషయాలపై అవగాహన పెంపొందించడాన్ని అభినందించారు. కార్యక్రమంలో జడ్పీహైస్కూల్ హెచ్ఎం మాచర్ల నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.